

# అగ్నిపుష్పం

రాధను యశోదనూ ఒకే స్త్రీ మూర్తిలో దర్శించారా ఎవరైనా? హారతి గురించి చెప్పాలంటే ఆ మాట చాలు.

నేను సైంటిస్ట్‌ను. అది భౌతికమైన విషయాలు, పరీక్షలకు నిలబడని అజ్ఞానాలు అంటే అసలు గిట్టదు నాకు. మానవ స్వభావానికి కారణమైన జీన్స్ మీద అనేక రకాల పరీక్షలు చేసి బహుమతులు పొందాను నేను. త్యాగాలకు, స్వార్ధానికి, లౌక్యానికి, నికృష్టతకు కూడా మనిషిలోని జీన్స్ కారణం అని తెలిసినప్పుడు, జంతువులే ఈ థియరీ ప్రకారం ప్రవర్తిస్తున్నప్పుడు, మానవత్వం, ఔన్నత్యం - వీటి మీద పెద్ద నమ్మకంలేదు నాకు. కవిత్వాలు, సౌందర్యారాధనలు – ఇవన్నీ మనిషిలోని ఉన్మాదావస్థకు చిహ్నాలనిపించేవి. ఏ సెంటిమెంట్లూ లేని నాకు 'భగవంతుడు' మనిషి ఊదిన ఊహల బెలూనులలాగా కనిపిస్తాడు. కానీ, విచిత్రమేమిటంటే మనిషి తననుకున్నట్లు, తను ఆలోచిస్తున్నట్లు బ్రతకగలిగితే మానవ సమాజం మరొకరకంగా ఉండేదేమో కానీ, వ్యక్తి సంఘజీవి. నా ఏ రకమైన ఆలోచనలతోనూ నా చుట్టూ ఉన్న మనుష్యులకు సంబంధం ఉండదు. కేవలం ప్రేమతోనో, అభిమానంతోనో, సంపాదనపరుడననే గౌరవంతోనో నా ఆలోచనలు విన్నట్లు గౌరవించినట్లు నటించేవారు. ఆ విషయం అర్థమైనప్పుడల్లా, నాకు హైపర్ టెన్షన్ వచ్చేది. అంతే నేను మహా కోపిష్టినని ముద్ర వేశారు. కానీ, అందరి మనుష్యుల్లాగే నాకూ కొన్ని బలహీనతలు ఉన్నాయి. అందులో అతి ముఖ్యమైనది నా ఆలోచనలను ఎదటివారి మీద బలవంతంగా రుద్దడం, కన్నీరు తెప్పించడం ఆ తరవాత ఆ బాధ చూడలేక లొంగిపోవడం. ఈ గుణం నాలో తెలియని మార్పులు ఎన్నో సృష్టించింది.

"పెళ్ళేమిటి? సెంటిమెంటల్ నాన్సెన్స్ ....మారేజ్ ఈస్ ఎ మోస్ట్ ఎకనామికల్ వే ఆఫ్ గెటింగ్ ఫుడ్ అండ్ సెక్స్...." అని వాదించే నన్ను మా అమ్మ కన్నీళ్ళు, మా నాన్న బాధ లొంగదీసుకున్నాయి. 'ఒక్కగానొక్క పిల్లాడివిరా' అనే మావాళ్ళ మాట నా అహానికి తృప్తి కలిగించింది. "వాళ్ళ పిల్లకు వాళ్ళు సరదాగా పెట్టుకుంటూంటే మధ్య నీ బాధ ఏమిటిట?" అని కసిరి మావాళ్ళు కట్నం కూడా పుచ్చేసుకున్నారు. నా ఆలోచనలను, ఆశయాలను అగ్నిహోత్రం పాలుచేసినట్లు–మండిన కళ్ళతో, పెళ్ళి తంతును తిట్టుకుంటూ, పెళ్ళి పీటల మీద కూర్చున్న నాకు కనబడింది ఆమె.

ఇన్నాళ్ళ తరవాత, ఈ యాభైయ్యవ పడిలో జీవితంలో మామూలు మనిషికి ఉండే అన్ని సౌఖ్యాలు పొందిన నేను ఒక్కసారి గతంలోకి తొంగి చూస్తూంటే ఏనాడో సహం చదువుతూండగా పోయిన మంచి పుస్తకం మళ్ళీ దొరికినట్లనిపిస్తుంది హారతి జ్ఞాపకం. మామూలుగా బ్రతికేస్తున్న మనిషి ఆగి అప్పుడప్పుడు ఆలోచించుకుంటే, వేసవి ఎడారుల్లో మంచిగంధపు తుఫానుల్లాంటి అందమైన అనుభూతులు ఉక్కిరిబిక్కిరి చేసేవి కొన్ని ఉంటాయి. మనిషి ఆయుఃపరిమాణం కాలానికి కట్టుబడితే, మనిషిలోని ఆత్మ అనుభూతుల వాసనతో అజరామరమౌతుంది. ఆత్మ....పూర్వజన్మ వాసనలు....ఇవన్నీ తరవాత చదివాను. నేను ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, ఈ ఆలోచనలన్నీ ఆమె తరవాతవి.

"మీట్ మై డియరెస్ట్ ఫ్రెండ్ హారతి...." అన్నది అప్పుడే నామీద అధికారాలు సంతరించుకుంటున్న నా భార్య.

అసలే విసుగ్గా ఉంది ఈ పెళ్ళి తంతు. ఒక్కసారి అందరి మీదా విరుచుకు పడిపోయి లేచి పారిపోదామా అనిపిస్తున్న నేను తలెత్తి చూసి, ఆటోమేటిక్‌గా చేతులు జోడించాను 'సూడో కల్చర్' అని తిట్టుకుంటూ. ఆమె....గులాబీరంగు చీర, చిన్న బొట్టు, కనీకనబడనట్లుండే నాజూకైన నగలు, కాటుకలేని కళ్ళు, చీరలో కలిసిపోయిన ఒంటి రంగు, హిమాచలాలే ఘనీభవించాయా అన్నట్లుండే ఆ కళ్ళు....అంతలో సౌందర్యానికి రవసెల్లా వేసినట్లు చటుక్కున కళ్ళు దించుకుని 'విష్ యు హేపీ మారీడ్ లైఫ్' అని సున్నితంగా చెప్పి చేతులు జోడించి మెల్లిగా జనంలోకి వెళ్ళిపోయింది.

"ఎవరా అమ్మాయి?" అప్రయత్నంగా అడిగాను.



# జలంధర

"నా స్నేహితురాలు...."

అటే చూశాను....ఆమె లేదు.

మనిషికి మనిషికి మధ్య స్పందన అని ఎక్కడన్నా చదివితే విరగబడి నవ్వే నాకు ఎందుకో హారతిపట్ల ఏదో తెలియని అనుభూతి కలిగింది. అంతా ట్రాష్ అంటూనే ఆలోచిస్తున్నాను నేను.

"హారతి .... అయినా అదేం పేరు?" అన్నాను ఆ తరవాత మాటల్లో భార్య శారదను కదిలిస్తూ.

"నిజమేనండీ! కర్పూరహారతిలాంటిదే దాని జీవితం. ఆలోచించే పెట్టారు వాళ్ళవాళ్ళు...." అంది శారద మెల్లిగా. నా భార్య చాలా సనాతనం. పొరపాటున కాలు తగిలితే ఎదటివాళ్ళు ఇబ్బందిపడేదాకా వంగి కళ్ళకద్దుకోవడం, కనబడ్డ రాయికి, గోపురంలా కనిపించితేచాలు అది ఏ ఇంటి బురుజైనా నేమోనని ఆలోచించకుండా తలవంచి అర్ధనిమీలిత నేత్రాలతో దణ్ణం పెట్టడం, వాచీ పెట్టుకుని, అదే చేతికి గాజులు వేసుకునే కల్చరు, పసుపురాసిన కాళ్ళకు మట్టెలు పట్టాలు పెట్టుకుని హీల్సు వేసుకునే తత్వం, నేను ఏడిపించినకొద్దీ 'నా పద్ధతింతే' అని తేల్చి చెప్పే సున్నితమైన మొండితనం, అతి మంచితనం, కొంచెం పెంకితనం ఇవన్నీ మూర్తీభవిస్తే నా శారద.

ఆ తరవాత హారతిని మళ్ళీ చూశాను మా ఇంట్లో. అదే మనిషి అదే సున్నితమైన మాట, ఘనీభవించిన చూపు, పలుచని వెన్నెల్లాంటి చిరునవ్వు. కానీ, మాటలు? ఆ మనిషితో మామూలు ఆడవాళ్ళతో మాట్లాడినట్లు మాట్లాడడం చాలా కష్టమని అర్థమైంది నాకు.

శారద నమ్మకాల గురించి వెక్కిరించి ఏడిపిస్తున్నాను నేను. ఒక రకంగా నిజమేనేమో. ఆమెది అజ్ఞానమైనా దానికి సెంటిమెంటు ఉంది. కొంత బలం ఉంది. 'కానీ మీ అపనమ్మకాలన్నీ ఆకాశ దీపాల్లాంటివి. మీకు పూర్తిగా దేనిమీదా నమ్మకంలేదు సరే....కనీసం అపనమ్మకం కూడా లేదే' సన్నగా నవ్వుతూ అన్న మాటలకు తెల్లబోయి చూశాను నేను.

"నా గురించి ఏం తెలుసని అలా మాట్లాడుతున్నారు మీరు?"

"తెలియక్కర్లేదు చూశాను. మొన్న పెళ్ళి తంతులో మీకు ఏది ఇష్టమనిట అన్నీ అంత శ్రద్ధగా చేశారు? ఇదంతా నాన్సెన్స్, చెత్త అనుకుంటూనే అన్నీ ఆచరిస్తున్నారు మీరు. మీ ఐడియల్స్‌కు శత్రువులు ఎవరో కారు మీరే .." అంది మళ్ళీ నవ్వుతూ.

నాకు కోపం ఎందుకు రాలేదో యిప్పటికీ అర్థంకాదు. ఆ మాటే, ఆ తరువాత, మరింత పరిచయం పెరిగాక అంటే, "కారణం ఒకటే....నేను వెక్కిరింపుగానూ, హేళనగానూ అనలేదు. హెచ్చరించాను...అంతకన్న యింకేం లేదు...." అనేసింది.

"అంతకన్న ఇంకేం లేదా?" పరీక్షగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాను నేను. శారద టీ కప్స్ లోపల పెట్టడానికి వెళ్ళింది.

మెల్లిగా చూపు మార్చేసింది...."మీ మారేజ్ ఆల్బం కావాలి నాకు" అంది. పరీక్షగా ఆమెనే చూస్తున్న నాకు ఆ మాటల్లో ఏదో ధ్వని....'నీకు పెళ్లైంది' అనా? లేక, అలా మాట్లాడకూడదూ? అనా! ఇంతవరకు ఎంతో మంది ఆడపిల్లల అల్లరి కబుర్లు విన్నాను నేను. కానీ, ప్రతి మాట వెనకాల ఏదో తెలియని ప్రతిధ్వని విన్నది 'హారతి'లోనే!

"చాలా అందమైంది కదూ మీ ఫ్రెండ్...." అన్నాను ఆ తరవాత శారదతో.

చురుగ్గా చూసింది....ఉలిక్కిపడ్డాను నేను. నా మాటల్లో తెలియని వాంఛ ఏదో వినిపించి ఉండాలామెకు.

"నా ఉద్దేశ్యం అది కాదు...." అని ఏదో చెప్పబోయాను.

"ఎందుకలా బుజాలు తడుముకుంటారు? అయినా, హారతిలాంటి వాళ్ళ పేరు....దాని సౌందర్యం, తెలివి తేటలు అడవి కాచిన వెన్నెలలా అయిపోయాయి. మానవత్వం లేదండీ వాళ్లాయనకు...."

" హారతికి పెళ్ళైందా ?" ఆశ్చర్యంగా అడిగాను.

" అంటే మీ ఉద్దేశ్యం ? దానికి యిద్దరు పిల్లలు కూడా !"

ఇది నా ఊహకందని విషయం. హారతి...ఆవిడ నా ఊహల్లో తెలియని రూపు దిద్దుకుంటున్న గగన కుసుమం. ఆమె మామూలుగా పెళ్ళాడి, పిల్లల్ని కని....ఛా! ఛా! నా ఊహలకు పొంతన లేదు....ఏమిటిది ? నేను కూడా యిలా సెన్టిమెంటల్ ఇడియట్‌లా తయారౌతున్నాను ? ఛా ! అందరు ఆడవాళ్ళ ఒకటే.

నోములకు నా భార్య హారతిని పిలవలేదు....అదేమని అడిగాను.

" అది రాదండీ ! తను పసుపు కుంకుమలకు నోచుకోలేదు !" కళ్ళంబడి నీళ్ళతో అంది శారద.

" వాట్ నాన్సెన్స్ ఆర్ యు టాకింగ్...."

" నిజమండీ ! దాని భర్త పోయాడు...."

ఒక్కసారిగా ఈ ప్రపంచమంతా నాకు గిర్రున తిరిగినట్లైంది.

" అయినా అదేం జబ్బు నీకు....ఇంకా అలాంటి ఫూలిష్...."

" ష్ ! ఎక్కువ మాట్లాడకండీ ! నా హారతి విషయంలో నాకు అల్లాంటివేం లేవు. నేను అనుభవించే నరకం మీకెలా అర్థమౌతుంది ? అది, నేను పసిపిల్లల దగ్గర నుంచి స్నేహితులం. వందకాసుల బంగారం, లక్ష రూపాయల కట్నం యిచ్చి చేశారు పెళ్లి వాళ్ళవాళ్ళు. అతనొక పెద్ద ఇంజనీరు. కాని, మనసు ఎదగలేదు....దానికి అన్యాయం జరిగింది. అతను విధించిన శిక్ష నుంచి అది బయటపడలేక పోతోంది...." చీర కొంగుతో కళ్ళంబడి నీళ్ళు తుడుచుకుంటూ అంది శారద.

హారతి కథ క్లుప్తంగా యిది :

ఎంతో కట్నంతో, మరింత సౌందర్యంతో వచ్చిన హారతిని ఆమె భర్త భరించలేకపోయాడు. ఆమె సౌందర్యం, ఆత్మాభిమానం అతని స్థాయికి దిగజారలేకపోయాయి. జీవితంలో ఎంత గొప్ప వస్తువైనా, డబ్బు రూపంలో దాని విలువేమిటని ఆలోచించే మనుష్యుల మధ్య నుంచి వచ్చిన అతని ఆలోచనలు చాలా అట్టడుగువి. అందుకనే, సున్నితమైన, సుకుమారమైన హారతిని భరించలేకపోయాడతను. హింసించాడు, బాధపెట్టాడు. వీటిని సహించేదేమో కానీ అనుమానించి మనసు మీద వాత పెట్టాడు. వాటికీ తలవగ్గక పోనేమో కానీ, ఆమెకు ఏమాత్రం సరితూగని ఆడదానితో సంబంధం పెట్టుకున్నాడు. తన కోరికలకి, డబ్బుకు లంకె కుదరలేదు. ఏదో ఫ్రస్ట్రేషన్‌లో ఈ ప్రపంచం నుంచి శాశ్వతంగా శలవు తీసుకున్నాడు. కానీ, వెళ్ళిపోతూ, " ఈ అకాల మరణానికి కారణం హారతి " అని తెలియజెప్పాడు. సంఘంలో, బంధువులనే రాబందుల మధ్య హారతి– అతి సున్నితమైన హారతి–చీకాకుల చిలకలా చిక్కింది. ఆమె కన్నీళ్ళు, ఆ వేదన ఎవరికీ అక్కర్లేకపోయాయి. బ్రతకకూడదు అనుకుందామంటే పసిపిల్లలు కాలికి అనుబంధాలై పోయారు.

అన్నపూర్ణ విగ్రహం ముందు తానే వెలిగే హారతిగా మారి, అనంతమైన చీకటిలోని మృత్యురేఖగా వచ్చి తనను తీసుకుపొమ్మని ఎన్నోసార్లు ప్రార్థించింది హారతి. బ్రతకక తప్పదనుకున్నప్పుడు అందంగా, తెలివిగా బ్రతకడానికి అలవాటు పడింది. ఏదో ఉద్యోగం చేస్తోంది.

ఈ కథ నాలో చీకటి కోణాల తలుపుల్ని బలవంతంగా లాగి తెరిపించింది. ఉక్కిరి బిక్కిరి చేసింది. ఏమిటావిడ జీవితం ! ఏదో కనబడని వక్ర రేఖలు, వినబడని అపశ్రుతులు.


మీ ముఖానికి కాంతి ఈ బొట్టు
శ్రీ కుంకుం బిందీ



శ్రీ కుంకుం బిందీ
భారత నారికి మరేదీ చేకూర్చని అందం, పరిపూర్ణత్వం, నిండుదనం ఇస్తుంది

- మరకలు పడదు
- ముఖంపైన పాకదు
- సహజ సుందరమైన 'ఫినిష్'
- ముచ్చటైన సువాసన
- ఆకర్షణీయమైన అనేక రంగుల్లో

శ్రీ కుంకుం బిందీ
భారతనారి గర్వించగల చిహ్నం




శ్రీ కాస్మెటిక్స్
కుర్లా, బొంబాయి—70.

"ఇది నిజమా? అటువంటి రాక్షసుణ్ణి ఎలా భరించారు?" అని అడిగాను మళ్ళీ హారతిని కలిసినప్పుడు....ఎక్కడికీ రాని హారతి, శారద బలవంతం మీద అప్పుడప్పుడు మా ఇంటికీ వస్తుంది.

"అనవసరంగా తిట్టకండీ...అతని లెవల్ అంతే. అందుకే పెళ్ళి చేసేటప్పుడు స్థాయి చూడాలంటారు మనవాళ్ళు. ఐశ్వర్యాల స్థాయి చూస్తారు కానీ, మానసికమైన వాటి గురించి ఆలోచించరు. నా ప్రవర్తన అతనిలో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ నిద్ర లేపింది. నాకూ చిన్నతనం కదా! కలలలో బ్రతికే వయస్సు. అతనిలో తక్కువతనాన్ని భరించలేక రెచ్చగొట్టేదాన్ని. దాని ఫలితం – ఇదుగో యిలా పరిణమించింది. కొన్ని తప్పించుకోలేం... మా వాళ్ళు చూసిన జాతకాలు, పెట్టిన ముహూర్తాలు...."

"అంతా ట్రాష్....ఏమైంది యిప్పుడు?"

"అలా అనెయ్యకండి. అన్నింటి వెనకాలా ఏదో తెలియని ఫోర్స్ ఒకటి వుంటుంది. జ్యోతిష్యశాస్త్రం తప్పనకండి. యోని పొంతనాలు మీ జీన్స్ థియరీ ఒకటేనేమో....మీరు చెప్పే, అల్ట్రాయిజమ్, సెల్ఫిష్‌నెస్, స్ప్రైట్ థియరీలన్నీ ఒకప్పుడు భర్తృహరి సుభాషితాలు చెప్పాయి. మనిషి స్వార్థం కోసరం శాస్త్రాన్ని మార్చుకుంటే చెప్పలేం కానీ, లేకపోతే తెలుసుకోవాలంటే చాలా వుంది."

ఏమిటీ అమ్మాయి! అర్థం కాలేదు నాకు...." ఎప్పుడు ఏ విషయం అవునంటుందో, ఎప్పుడు కాదంటుందో, ఎందుకలా అంటుందో, చిక్కుముడి అంతా....

"ఇంత తెలిసి మరి మిమ్మల్ని మీరే సంఘం నుంచి యిలా దూరం చేసుకుంటున్నారెందుకని....?"

"ఏంలేదు. మొదట్లో బాధగా వున్నా, తరవాత అలవాటైంది. ప్రపంచానికి దూరంగా గాలరీ సీట్లో కూర్చుని జీవితాన్ని సమీక్షిస్తున్నట్లుంది."

రోజురోజుకూ ఆమెలో కొత్తమనిషిని చూశాను నేను. ఆమెలో స్త్రీత్వాన్ని నిద్ర లేపాలనే చిలిపి ఆలోచన వచ్చేది నాకు. ఎంతటి గొప్ప స్త్రీ అయినా, పొగడ్తకు బానిస అనుకునే నన్ను సన్నగా నవ్వుతూ శాసించేది ఆమె. సాధారణమైన ఆడదానిలోలేని గొప్పగుణం ఆమెలో వుంది. ఆమె ఏమిటో ఆమెకు తెలుసు. ఆమె మీద నాకున్నది ప్రేమో, జాలో, ఆరాధనో తెలియని అయోమయ స్థితిలో ఉండగా శారద పురిటికి వెళుతూ "అసలే అయోమయం మనిషి హారతీ! కాస్త కనిపెట్టి వుండు" అని జాగ్రత్తలు చెప్పి వెళ్ళింది. దానికి కారణం శారదకు జలసీ లేక కాదు. హారతి మీద నమ్మకం. ఆ విషయంలో శారదకు నమస్కరించ బుద్దేస్తుంది నాకు. మామూలు జ్వరం టైఫాయిడ్‌గా పరిణామం చెందడానికి మూడు రోజుల ముందే హారతికి ఫోన్ చేశాను. జ్వరం....నీరసం! ఈ బాధలో హారతి వస్తుందనే ఆలోచన హాయిగా వుంది. మానసికంగా నేను యిటువంటి అవకాశానికే చాలారోజులుగా ఎదురు చూస్తున్నానేమోననిపించింది.

హారతి వచ్చింది. కర్పూరంలా, వెన్నెలలా, మలయమారుతంలా.... యింకేం రాయను?....నిస్సహాయంగా పడుకుని, ఆమె సేవలు పొందడంలో వున్న హాయి మామూలు మనిషికి ఎలా అర్థమౌతుంది? డబ్బు, వస్తువులు, ఆస్తులు, హోదాలు....ఇలాంటి చీపిరి ఆలోచనల మధ్య వున్న నాకు తృప్తి, నిశ్శబ్ద సంగీతం, స్పందనలాంటి కొత్త పదాలకు అర్థాలు అవనికలు చీల్చుకుని హారతి రూపంలో సాక్షాత్కరిస్తున్నాయి. ఆ చూపులో తృప్తి, ఆ సేవలో నిస్వార్థం, ఆ మాటలలో నిజాయితీ....ఆ పదిరోజులూ నా జీవనగ్రంథంలో మర్చిపోలేని మధుర సంగీతాలు ఎన్నో....

కానీ, ఆమెలో స్పందన లేదా? ఆలోచించదా? నా కళ్ళల్లో జీరాడే ఈ ఆరాధన, నా ప్రతి పలుకులో ధ్వనించే ఆహ్వానం ఆమెకు అర్థంకాలేదా? ఏమిటీ మనిషి? స్పందనే లేకపోతే ఈ సేవాతత్వం ఎక్కడిది? ఉంటే ఈ నిర్లిప్తత ఏమిటి?

ఆ మాటే అడిగాను. నా గొంతులోని నీరసం ఆమెను నిద్ర లేపిందేమో, అలవాటు చొప్పున మాట మార్చలేదు.

"నాకు అర్థంకావటంలేదని ఎందుకనుకుంటున్నారు? నా జీవితం నాకు చాలా నేర్పించింది మూర్తిగారూ! ఇంత చక్కటి తీయని అనుభూతులు రేపు మళ్ళీ ఉండవు. మనిషి ప్రవర్తన పరిస్థితులకు ఎప్పుడూ కట్టుబడిపోతుంది. అందుకే అశాశ్వతమైన ప్రపంచంలో ప్రతిక్షణం శాశ్వతం కావాలనుకోవడం పిచ్చితనం. ఈ క్షణంలోని భావాలు, రేపు మళ్ళీ మనకుండవు. అల్లాంటప్పుడు అవి కోరికలతో మలినమై గాయాల్లా జ్ఞాపకానికి రాకూడదు చూడండీ" మెల్లిగా కూర్చోబెట్టి బత్తాయి రసమిస్తూ నా చూపుల్తో తన చూపులు కలవకుండా చెప్పింది హారతి. ఆలోచిస్తూ కళ్ళు మూసుకుని పడుకున్నాను. ఆ ప్రతిమాట వెనకాలా తెలియని ధ్వని....ఇదే జీవితంలో ఆనందమా? ఏదో తెలియని మధురమైన అనుభూతి రక్తనాళాల్లో చిమ్మి ఆనందంతో ఊపిరాడనీయటం లేదు. దీని ఫలితమేమిటి? ఫలితమంటూ ఎందుకు ఆలోచించాలి? హారతి చెప్పినట్లు ఆ క్షణంలో నాకు వెయ్యి భగవద్గీతలు, లక్షలాది క్షణిక గ్రంథాలు అర్థమౌతున్నాయి.

ఆ మిగిలిన కొద్ది రోజుల్లోనూ మా ఇద్దరి మధ్య ఎన్నో చర్చలు. ఎంతో చదివింది హారతి. నాలో సైంటిస్టుకుండే మూర్ఖత్వాన్ని తొలిగించింది. తత్వవేత్తను చేసింది. ఆలోచనలకు పరిమళమద్దింది. నాలో తెలియని జ్ఞానం వెలిగించింది. ఎంత ఒద్దనుకున్నా ఆరోగ్యం చిక్కింది నాకు.

మాట్లాడుతూండగానే ఒక మధ్యాహ్నం మటుమాయమైపోయింది హారతి. అలా అర్థంతరంగా వెళ్ళిపోతుందని నా మనస్సెందుకో చెప్తూనే ఉంది నాకు. కర్తవ్యమైన మరుక్షణం నా దగ్గర ఉండదు నాకు తెలుసు.

ఆ తరవాత వాళ్ళ అన్నయ్య దగ్గరకు స్టేట్స్‌కు వెళ్ళిపోయింది హారతి. మరొకసారి కనబడింది. మామూలుగా మాట్లాడింది. ఎందుకు వెళ్ళిపోయింది? నాకోసమే అని గర్వపడటానికి హారతి విషయంలో నా మనసు అంగీకరించడంలేదు. ఈ అనుభూతి ఎంత ఉన్నతమైనదంటే, నాలో అహంకారాన్ని కూడా అది చంపేసింది. ఆ తరవాత హారతి ఇన్స్పిరేషన్‌తో చాలా చదివాను. ఎన్నో బహుమతులు, మెడల్స్ పొందాను. ప్రతిదాని వెనకాలా ఎవరికీ చెప్పుకోలేని తీయని అనుభూతి. కంగ్రాట్యులేషన్స్ లెటర్స్ మాత్రం వచ్చేవి.

"హారతి మళ్ళీ పెళ్ళి చేసుకోకూడదూ?" అని ఎవరో అడిగారు శారదను.

"హారతికి పెళ్ళా! దానిలా ఆలోచించే మొగవాడేలేడేమో! అది నిప్పు....దాన్ని భరించడం కష్టమే...." అంటోంది శారద.

అమాయకంగా చెప్పినా నిజం చెప్పింది శారద.

నిజం! హారతి ఒక అగ్నిపుష్పం. □